తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
ఆదివారం
11 మే 2025
పేజీలు : 08

# హైదరాబాద్‌లో అందాల భామలు



## 72వ మిస్ వరల్డ్ పోటీలు ఘనంగా ప్రారంభం

- 110 దేశాల నుంచి పాల్గొన్న అందాల తారలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శుభారంభం
- 250 మంది కళాకారులతో మంత్రముగ్ధమైన పేరిణి నృత్యం
- మిస్ వరల్డ్ క్రిస్టినా పిజ్కోవా ప్రత్యేక ఆకర్షణగా నిలవగా
- తెలంగాణ సంస్కృతి వైభవాన్ని ప్రదర్శిస్తూ
- ర్యాంప్‌పై సుందరీమణుల అద్భుత ప్రదర్శన

హైదరాబాద్ సిటీ, మే 10 (జనంసాక్షి): గచ్చిబౌలి ఇండూర్ స్టేడియంలో పర్యటన శాఖ మంత్రి జూపల్లి కృష్ణ రావు, చీఫ్ సెక్రటరీ రామకృష్ణ రావు, సెక్రటరీ జాయేష్ రంజన్ కలిసి వేడుకలు ప్రారంభించారు. 116 దేశాల నుండి పోటిల్లో అందగత్తెలు పాల్గొన్నారు. ప్రారంభోత్సవ వేడుకల్లో



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.భారీగా ప్రేక్షకులు హాజరయ్యారు.మిస్ వరల్డ్ ప్రారంభ సమావేశంలో తమ దేశీయ ఆహార్యంతోపాటు ఆయా దేశాల సంస్కృతి, సాంప్రదాయ వేష దారణలతో లాటిన్ అమెరికా దేశాల ఆఫ్రికన్ దేశాలకు చెందిన 22 దేశాల కాంటెస్టర్లు అలరించారు.గుస్సాడీ, కొమ్ము కోయ కళాకారులు ప్రదర్శన విదేశీ అతిథులను ఆకర్షించింది.కరేబియన్ లాటిన్ అమెరికా తో పోటీదారులు రాక మొదలయింది. మొదట అర్జెంటీనా కాంటెస్టెంట్ ర్యాంప్ పైకి వచ్చారు. రెండవ రౌండ్ కంటెస్టెంట్స్ ఆఫ్రికా ఖండం నుంచి అంగోలా తో మొదలైంది.ప్రదర్శన దేశీయ ముఖ్యంగా తెలంగాణ సంప్రదాయ సాంస్కృతిక కళలు, పోటీదారుల పాశ్చాత్య కళల మేళవింపుగా సాగింది.





లంబాడా కళాకారులు డప్పు నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రపంచంలోనే ఒకటైన పురాతన కళగా నిర్వాహకులు ప్రకటించారు.మూడవ రౌండ్ కంటెస్టెంట్స్ యూరప్ ఖండం నుంచి అల్బేనియా ప్రతినిధితో మొదలైంది. మొత్తం 32 దేశాలు యూరప్ నుంచి ప్రాతినిధ్యం వహించాయి. వారి సంస్కృతి సాంప్రదాయాలను ప్రదర్శించారు.ఆ తర్వాత జరిగిన ఒగ్గుడోలు కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది.జాతీయ జెండాను చేతబూనిన కళాకారులు అద్భుత ప్రదర్శన చేశారు.చివరి రౌండ్ కంటెస్టెంట్స్ ఆసియా ఓషియానియా నుంచి ర్యాంపు పైకి వచ్చారు. మొత్తం 22 దేశాలు నుంచి ప్రాతినిధ్యం వహించాయి. వారి సంస్కృతి సాంప్రదాయాలను తమదైన శైలిలో ప్రదర్శించారు.మిస్ ఇండియా నందిని గుప్తా వచ్చినపుడు కరతాళ ధ్వనులతో స్టేడియం మారుమోగింది.చీర కట్టుతో ర్యాంపు పైకి వచ్చిన మిస్ నేపాలి అందరినీ ఆకర్షించింది.కంటెస్టెంట్స్ లో అందరికంటే చివరగా ర్యాంప్ పైకి వచ్చిన మిస్ వియత్నాం తనదైన డాన్స్ తో అందరినీ ఆకట్టుకుంది.మిస్ వరల్డ్ ప్రారంభ వేడుకల్లో ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.సీఎం వెంట పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు.

తమ తమ జాతీయ జెండాలు చేతపట్టి ఒకేసారి ర్యాంపు పైకి వచ్చిన 110 దేశాలకు చెందిన ప్రతినిధులు. మూడు రంగుల జెండాతో చివరగా మిస్ ఇండియా నందిని గుప్తా వారితో జత చేరారు.మిస్ ఇండియాకు కరతాళ ధ్వనులతో స్వాగతంపలికారు.

సరిహద్దుల్లో దేశం కోసం పోరాడుతున్న సైనికులకు వారి ధైర్య సాహసాలకు నిర్వాహకులు సెల్యూట్ ప్రకటించారు.ప్రపంచ శాంతికి పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ చక్కటి మెసేజ్ ఇచ్చామన్నారు. తెలంగాణ టూరిజం ప్రమోట్ చేయమని కంటెస్టెంట్స్ ను జయేష్ కోరారు.మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభం అయినట్లు సీఎం రేవంత్ రెడ్డి, మిస్ వరల్డ్ సీఈఓ జూలియా మోర్లీ ప్రకటించారు.జాతీయ గీతం ఆలాపన జరిగింది.హైదరాబాద్ గచ్చిబౌలిలో మిస్ వరల్డ్-2025 ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.చివరలో మిస్ వరల్డ్ గీతాలాపణలో అన్ని దేశాల ప్రతినిధులు గొంతు కలిపారు.ప్రపంచ శాంతికి, ఐక్యతకు మిస్ వరల్డ్ పోటీలు కూడా పాటుపడతాయని నిర్వాహకులు ప్రకటించారు. తెలంగాణ జరూర్ ఆనా నినాదంతో కార్యక్రమం ముగిసింది.

## హైదరాబాద్ పోరడు 2 పోస్టర్‌ని ఆవిష్కరించిన ఉప్పల

నాగోల్ (జనం సాక్షి) : ఉప్పల క్యాంపు కార్యాలయంలో అసద్ ఆధ్వర్యంలో హైదరాబాద్ పోరడు 2 సాంగ్ పోస్టర్‌ని ఆవిష్కరించిన టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మెన్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త. ఈ సందర్భగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ఈ సందర్భగా నిర్వహకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పాట విజయం సాధించి మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటు న్నట్లు చెప్పారు. హైదరాబాద్ జీవన విధానం హైదరాబాద్ అలవాట్లు మరియు చాయి ఫేమస్ హైద్రాబాద్ స్టైల్ మీద అద్భుతంగా సాంగ్




రూపొదించబడిందని అందరూ తప్పక వినాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో లోకేష్, నవీన్ పాల్గొన్నారు.

## అటు ఫిర్యాదు.. ఇటు స్పందన

- సర్కారు జాగాల్లో అక్రమ నిర్మాణాలను అరికట్టిన డిప్యూటీ మేయర్
- చాకచక్యంగా స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి
- తార్నాక ఎర్రకుంట చెరువు స్థలాల్లో నిర్మాణాలు తొలగింపు
- హైడ్రా కృషిని అభినందించిన మోతె శ్రీలత శోభన్ రెడ్డి



## అబ్దుల్లాపూర్ మెట్టులో వీరజవాన్ మురళి నాయక్‌కు సిపిఐ నివాళులు



**అబ్దుల్లాపూర్ మెట్టు, మే 10, (జనంసాక్షి):** దేశం కోసం చిన్న వయసులో పాకిస్తాన్‌తో పోరాడి ప్రాణాలు అర్పించిన వీర జవాన్ మురళి నాయక్‌కు కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి జోహార్లు సమర్పించారు. శనివారం రావి నారాయణరెడ్డి కాలనీ ఫేస్ 3లో జరిగిన కార్యక్రమంలో కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని, మురళి నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి, మురళి నాయక్ త్యాగం దేశ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. వారి కుటుంబానికి దేశప్రజలు అండగా ఉంటారని, ప్రభుత్వం వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. పాకిస్తాన్ ప్రేరిత ఉగ్రవాదులను అంతమొందించి, వారి నుంచి దేశానికి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. అప్పుడే అమరులైన వీరజవాన్లకు నిజమైన నివాళులు అర్పించిన వాళ్లమవుతామని పేర్కొన్నారు. యుద్ధ సమయంలో ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకొని, వీర జవాన్లకు, పౌరులకు రక్షణ కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. "జై జవాన్, జై హింద్" అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల జిల్లా నాయకుడు మాధవరెడ్డి, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ అజ్మీర హరి సింగ్ నాయక్, పొన్నాల యాదగిరి, వట్టి నవనీత, సైదులు ముదిరాజ్, వినోద్ నాయక్, ఆవుల యాదగిరి, వీరేష్, గణేష్ నాయక్, గోపి, పాండు, దేవమ్మ, వెంకట్, రాములు, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

- మల్కిజ్ గూడ గ్రామంలో గ్రామదేవతల విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**యాచారం, (జనంసాక్షి):** దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలుగా ఉంటూనే నిరంతరం ప్రవర్ధమానమై మానవ దైనందిన జీవితానికి ఆధ్యాత్మిక మానసిక ప్రశాంతతను చేకూరుస్తున్నాయని ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మల్కీజుగుడలో ఎల్లమ్మ, ఈదమ్మ, మార్కమ్మ గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దేవాలయ నిర్మాణ దాతగా వెంకట్ రెడ్డి ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. పూర్వం చిన్న చిన్న దేవాలయాలు నిర్మించి రాళ్లపైన దేవతల విగ్రహాలు ప్రతిష్టించేవారని కానీ నేడు గ్రామాల్లో దేవతలకు దేవాలయాలు నిర్మిస్తూ దేవత మూర్తులకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని అన్నారు. ప్రతిష్టించబడిన దేవతలు గ్రామాలు సస్యశ్యామలంగా ఉండేలా అన్ని వర్గాల ప్రజలను ఆదుకొని ఆశీర్వదించేలా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీలు కే శ్రీనివాస్ రెడ్డి, గజ్జి రామకృష్ణ యాదవ్, నాయకులు మూడేడ్ర వెంకట్ రెడ్డి, అమృత సాగర్, ఉప్పల భాస్కర్ గుప్తా, వరికుప్పల సుధాకర్, చీర శేఖర్, పాండురంగారెడ్డి, నర్రె శ్రీశైలం భక్తులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గురునానక్ విద్యా సంస్థలలో ఘనంగా 24వ వార్షికోత్సవ వేడుకలు






**ఇబ్రహీంపట్నం, (జనంసాక్షి):** గురునానక్ విద్యా సంస్థల లో 24వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్ట రెడ్డి హాజరయ్యారు. ఉన్నత విద్యకు సంస్థలు అందిస్తున్న అత్యుత్తమ కృషిని ప్రశంసించారు. పేటెంట్లు, డిజైన్లు మొదలైన వాటిని దాఖలు చేసుకోవడానికి ఆవిష్కర్తలు, విద్యార్థులు మరియు అధ్యాపకులకు సేవలను అందించే ఎం.ఎస్.ఎం.ఈ - మేధో సంపత్తి సౌకర్యాల కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలతో ఉత్పత్తుల రూపకల్పన కోసం ఏ.ఐ.సి.టి.ఈ ఐడియా ల్యాబ్‌ను ఉపయోగించుకుంటున్నందుకు విద్యార్థులను ఆయన అభినందించారు. విద్యార్థులను "భారతదేశ భవిష్యత్తు" అని అభినందిస్తూ నిరంతర వృద్ధి మరియు అంకితభావం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. విద్యార్థులు తమ వృత్తిపరమైన ప్రయాణాలలో నిబద్ధత, చురుకుగా ఉండి మరియు ఫలితాలపై దృష్టి పెట్టాలని కోరారు. అంతకుముందు మే 9న, స్కైలార్క్ స్మార్ట్ మీటర్ల సంస్థ సి.ఈ.ఓ శ్రీ దినేష్ భూటాడ, గురు నానక్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (జి.ఎన్.ఐ.టి) లో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తన స్ఫూర్తిదాయక ప్రసంగంలో, ఆయన జి.ఎన్.ఐ.టి.ని నిజంగా ఆవిష్కరణ మరియు శ్రేష్ఠతను పెంపొందించే సంస్థగా ప్రశంసించారు మరియు వారి అద్భుతమైన విజయాలకు విద్యార్థులు మరియు అధ్యాపకులను అభినందించారు. గురునానక్ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ మరియు గురునానక్ సంస్థల వైస్-చైర్మన్ సర్దార్ జి.ఎస్. కోహ్లీ మాట్లాడుతూ విద్యార్థుల విద్యా మరియు ప్లేసెమెంట్ విజయాలకు అభినందనలు తెలిపారు.. అద్భుతమైన ప్లేస్‌మెంట్ సీజన్‌ను హైలైట్ చేస్తూ, 224 క్యాంపస్ డ్రైవ్‌లు ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ రెండూ నిర్వహించబడ్డాయని, దీని వలన 1517 ప్లేస్‌మెంట్ ఆఫర్లు వచ్చాయని ఆయన తెలియచేసారు. ప్రముఖ దేశ, విదేశీ సంస్థలైన ము సిగ్మా, కాగ్నిజెంట్, టిసిఎస్, యుఎస్‌టి గ్లోబల్, హెచ్‌సిఎల్, థూత్ ట్రాన్స్‌మిషన్, ఎల్‌టిఐ మైండ్‌ట్రీ, విజన్ వేవ్స్, కియా మోటార్స్, రాయల్ ఎన్‌ఫీల్డ్ మొదలైనవి తమ విద్యార్థులకు నియమించుకున్నట్లు చెప్పారు. గురునానక్ విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హెచ్.ఎస్. సైని, నిరంతర విద్యా విజయాలకు అధ్యాపకులు మరియు విద్యార్థులను ఆయన ప్రశంసించారు. ప్రస్తుత పరిస్థితుల్లో నిలబడటానికి అన్ని అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలను అభివృద్ధి చేయడం ద్వారా మనం ఆత్మ నిర్భర్ భారత్‌గా ఉండాలని ఆయన సలహా ఇచ్చారు. విద్యా సంస్థల వార్షిక నివేదికలను డాక్టర్ ఎస్. శ్రీనాథ రెడ్డి, డాక్టర్ కె. వెంకటరావు (ప్రిన్సిపాల్, జి.ఎన్.ఐ.టి) సమర్పించారు. ఈ కార్యక్రమంలో జి.ఎన్.ఐ.టి డైరెక్టర్ డాక్టర్ సంజీవ్ శ్రీవాస్తవ, డాక్టర్ పి. పార్థసారథి జాయింట్ డైరెక్టర్, డాక్టర్ రిషి సయాల్, అసోసియేట్ డైరెక్టర్, డాక్టర్ ఎస్.వి. రంగనాయకులు, డీన్, వినయ్ చోప్రా, డైరెక్టర్-ప్లేస్‌మెంట్స్, డాక్టర్ హరీష్ కుంద్రా, వార్షిక దినోత్సవ సమన్వయకర్త, డాక్టర్ బి. కేదార్‌నాథ్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## 16న కురుమ భవన్ భూమిపూజ



**ఉప్పల్ మే 10 (జనంసాక్షి):** ఉప్పల్ బీరప్పగడ్డలో కురుమ భవన్ నిర్మాణానికి మే 16న భూమిపూజ జరగనుంది. ఈ కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందరన్ను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఈ భవనం పేదల ప్రయోజనానికి ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. హాజరవుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గొరిగే కృష్ణ కురుమ, గొరిగే మల్లేశ్, చిందం వెంకటేశ్, బర్ల కృష్ణ, ఎర్ర శ్రీనివాస్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో నరసింహ, సుదర్శన హెూమాలు



**ఉప్పల్ మే 10 (జనంసాక్షి):** ఉప్పల్ రామంతపూర్‌లో మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో నరసింహ,సుదర్శన హెూమాలు శనివారం నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతం కోసం, దేశంకోసం, ధర్మం కోసం భారత సైన్యం చేపట్టినటువంటి మహత్తర కార్యక్రమం విజయవంతం కావాలని హెూమాలు నిర్వహించినట్లు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తెలిపారు.

## వినాయక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి అవార్డు దక్కడం గర్వకారణం

- ఆసుపత్రి వైద్యుల పట్టుదల కృషితోనే అవార్డు సాధ్యం
- వినాయక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి : చైర్మన్ వర్త్య విఠల్ నాయక్




**తాండూరు మే 10(జనంసాక్షి):** వినాయక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి అతి తక్కువ కాలంలో అవార్డు దక్కడం గర్వకారణమని వినాయక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి చైర్మన్,మరియు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్రస్థాయి వీసా హెల్త్ అవార్డు ఎంపిక లో తాండూర్ కు చెందిన వినాయక సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ హెల్త్ అవార్డు ను సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా సందర్భంగా శనివారం వినాయక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో వీసా హెల్త్ అవార్డుల పురస్కార లలో తాండూరు వినాయక సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ అందుకున్న డాక్టర్ హాస్పటల్ డైరెక్టర్ కేతావత్ రవీందర్ రాజా ను ఘనంగా వినాయక సూపర్ స్పెషలిస్ట్ హాస్పిటల్ చైర్మన్ విట్టల్ నాయక్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి ప్రారంభించిన అతితక్కువ కాలంలోనే అవార్డు రావడం చాలా సంతోషకరమన్నారు. తెలంగాణ రాష్ట్ర మంత్రుల శ్రీధర్ బాబు సీతక్క చేతుల మీదుగా అందుకున్న డాక్టర్ రవీందర్ రాజా, తాండూర్ పట్టణంలోని వందపడకల ఆసుపత్రి ప్రారంభించిన తర్వాత తాండూర్ నియోజకవర్గంలో అనేక గ్రామాల నుండి ప్రజలు వినాయక ఆసుపత్రికి వచ్చి అనేక వైద్య సేవలు చేయించుకుంటున్నారు. అతి తక్కువ కాలంలోనే తాండూర్ లోని గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఎండి సల్మాన్ చే గుండె ఆపరేషన్ చేసి విజయవంతంగా వినాయక సూపర్ స్పెషలిస్ట్ హాస్పిటల్ ఉందన్నారు. డాక్టర్ హాస్పటల్ డైరెక్టర్ కేతావత్ రవీందర్ రాజా మాట్లాడుతూ ఈరోజు వినాయక సూపర్ స్పెషలిస్ట్ హాస్పిటల్కు అవార్ రావడం చాలా సంతోషకరమని అలాగే రాష్ట్రంలోని తొలిసారిగా వినాయక స్పెషలిస్ట్ హాస్పిటల్ తరపున అవార్డు అందుకోవడం చాలా గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ ఎండి డాక్టర్ చందులాల్, గుండె వైద్య నిపుణులు డాక్టర్ సల్మాన్ హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో చేరిన మాజీ సర్పంచ్ అశోక్ యాదవ్



**కీసర, మే10(జనంసాక్షి):** కీసర మండలం చీర్యాల గ్రామ మాజీ సర్పంచ్ కోల అశోక్ యాదవ్‌తో సహా పలువురు గ్రామస్తులు బిజెపిలో చేరారు. శనివారం రోజున ఈటల రాజేందర్ సమక్షంలో బండారి నరసింహ యాదవ్, గూడ నరేష్ గౌడ్, సాయి కుమార్ గౌడ్ తదితరులు బిజెపి పార్టీలో చేరారు. వారికి ఈటల పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కీసర మండల బిజెపి పార్టీ అధ్యక్షులు కోల బాలరాజు యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిజెపి మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ సూచన మేరకు పట్లోళ్ల విక్రంరెడ్డి, ఏనుగు సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీసీఐ కంపెనీలో రాత్రి డ్యూటీలో చనిపోయిన హుసేన్ అలీ కుటుంబానికి 25 లక్షల నష్టపరిహారం చెల్లించాలి







**తాండూరు మే 10 (జనంసాక్షి):** సీసీఐ కంపెనీలో రాత్రి డ్యూటీలో చనిపోయిన హుసేన్ అలీ కుటుంబానికి 25 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం తాండూరు మండలంలోని సి.సి.ఐ కార్మాగారం ఎదురుగా సిఐటియు సీసీఐ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే శ్రీని వాస్ సిసిఐ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూని యన్ ప్రధాన కార్యదర్శి శరణప్ప మాట్లా డుతూ చనిపోయిన కార్మికుని కుటుంబానికి సీసీఐ యాజమాన్యం 25 లక్షలు చెల్లించా లని వారి కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం రాత్రిడ్యూటీ చేయడానికి ఒప్పం ద కార్మికుడు హుస్సేన్ హాలీ పంప్ హౌస్‌లో పనిచేస్తుం డగా ప్రమాదవశాత్తు చనిపోవ డం జరిగింది .చూసిన తోటి కార్మికులు యాజమాన్యానికి కార్మికులకు తెలియజేయగా యాజమాన్యం శనివారం ఉదయం 4 గంటలకు శవాన్ని పంచనామా లేకుండా పోలీసులు యాజమాన్యం కుమ్మక్కై కార్మికు లను బెదిరిస్తే డెడ్ బాడీని అంబులెన్స్‌లో వేసి తాండూర్ గవర్నమెంట్ హాస్పిటల్‌కు పంపించడం జరిగింది. యాజమాన్యం చేసే అరాచకాలని తీవ్రంగా ఖండించారు. ఉదయం సమాచారం తెలుసుకున్న కార్మికులు రాజకీయ నాయకులు కార్మిక సంఘ నాయకులు చేరుకొని కార్మికుల కుటుంబ సభ్యులు గేటు దగ్గర చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు న్యాయం జరగాలని, ఆందోళన చేపట్టారు. పోలీస్ డిపార్ట్మెంట్ కూడా వచ్చి యాజమాన్యానికి కార్మికులకు నాయకులకు వివిధ దఫాలుగా చర్చ జరిపించారు. చనిపో యిన కార్మికుల కుటుంబాలు బతకాలంటే 25 లక్షల రూపాయలు డిమాండ్ చేస్తూ చిన్న పిల్లలు తండ్రిని పోగొట్టుకున్న పిల్లలకు భర్తని పోగొట్టుకున్న భార్యకు న్యాయం చేయాలనీ కార్మికులు అందరూ ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో సీ.సీ.ఐ.కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శరనప్ప టి.ఆర్.ఎస్. నాయకులు మాజీ గ్రామ ఉప సర్పంచ్ హేమంత్ కుమార్. కాంగ్రెస్ నాయ కులు, ఎక్స్ ఎం.పీ.టీ.సీ. రాజకుమార్. అన్ని తరహా కార్మికులు నాయకులు మధ్యనే చర్చించారు. సీసీఐ యాజమాన్యం కంపెనీలో కార్మికులు చనిపోతే కుటుంబ సభ్యులకు నష్టపరిహారం చెల్లించకుండా వారి కుటుంబ సభ్యులకు రావాల్సిన సౌకర్యాలు కల్పించకుండా కాంట్రాక్టు కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందని సీసీఐ యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## యూకో బ్యాంక్ మేనేజర్ ప్రజల మన్నన పొందిన ఉదయ్ బాబు



**మొయినాబాద్,10(జనంసాక్షి):** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని యూకో బ్యాంక్ చిలుకూరు బ్రాంచ్ మేనేజర్ గారు గత మూడు సంవత్సరాల నుండి ఎనలేని సేవలు అందించి ప్రతి ఒక్కరితో ప్రేమ భావంతో మాట్లాడుతూ బ్యాంకుకు వచ్చినటువంటి ప్రతి కస్టమర్ యొక్క సమస్యను వెంటనే తీర్చేవాడు మంచి ఉన్నతమైన మనస్తత్వం కలిగినటువంటి బ్యాంక్ మేనేజర్ ఉదయ్ బాబు గారు ఈరోజు చిలుకూరు బ్యాంకు నుంచి బెంగళూరుకు ట్రాన్స్ఫర్ అవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ గారిని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ శ్రీ ముత్తినేని వీరయ్య వర్మ గారు ఫోన్ ద్వారా వీడ్కోలు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. వికలాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు యూకో బ్యాంక్ మేనేజర్ ఉదయ్ బాబు గారిని శాలువాతో సన్మానించి వీడ్కోలు తెలుపుతూ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి నరసింహ చారి జిల్లా కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం ప్రతినిధులు ఈ జ్ఞానేశ్వర్ పరమేష్ గౌడ్ దశరథ మరియు బ్యాంకు సిబ్బంది కావ్య, భావన, స్వప్న మరియు శ్రీనివాస్ పాల్గొనడం జరిగింది.

# డాక్టర్ జయప్రసాద్‌కు ఉత్తమ అవార్డు

- వైద్యవృత్తిలో పెదప్రజలకు మరింత సేవలు
- రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా అందజేత



**తాండూరు మే 10(జనంసాక్షి):** పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ జయప్రసాద్‌కు ఉత్తమ అవార్డు వరించింది. శుక్రవారం హైదరాబాద్ మణికొండలోని జేఆర్సీ కన్వెన్షన్ హాల్లో రాజ్ న్యూస్ ఛానల్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాలలో ఉత్తమ సేవలను అందించిన వైద్యులకు విస్నా హెల్త్ అవార్డులను అందజేశారు. తాండూరు నుంచి ఐఎంఏ అధ్యక్షులుగా, పేదలకు గుండెపోటు, క్యాన్సర్ తదితర అంశాలలో అవగాహన కల్పించడంతో పాటు ఉత్తమ వైద్య సేవలు అందించినందుకు గాను డా. జయప్రసాద్‌ను విస్నా హెల్త్ అవార్డుకు ఎంపిక చేశారు. ఇందులో భాగంగా కార్యక్రమానికి హాజరైన శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క,రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుల చేతుల మీదుగా డాక్టర్.జయప్రసాద్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు జయప్రసాద్ మాట్లాడుతూ తనకు అవార్డు లభించడం గర్వంగా ఉందన్నారు.మంత్రుల చేతుల మీదుగా అవార్డు అందుకివడం గర్వకారణంఅన్నారు. ఉత్తమ అవార్డులు పొందడం ద్వారా పేద ప్రజలకు మరిన్ని ఉత్తమ సేవలను అందించే ఉత్సాహం నింపుతాయన్నారు. వైద్య వృత్తిలో ఉన్నంత వరకు తన వంతు సేవలు అందిస్తానని తెలిపారు.

# పీహెచ్‌డి డాక్టరేట్ పట్టా పొందిన విద్యార్థినికి అభినందనలు

- డాక్టరేట్ పట్టా పొందిన ఆవుల రేణుకకు గ్రామస్తులు ఘన సన్మానం



**తలకొండపల్లి మే10(జనంసాక్షి):** తలకొండపల్లి మండల పరిధిలోని చంద్రధన గ్రామానికి చెందిన ఆవుల రాజయ్య యాదమ్మ దంపతుల పెద్ద కుమార్తె ఆవుల రేణుక ఉస్మానియా యూనివర్సిటీలో "కొండవీటి సత్యవతి రచనలు"పరిశీలన అనే అంశంపై ఆచార్య పి వారిజా పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా చంద్రదన తాజా మాజీ సర్పంచ్ బక్కి కుమార్ ముదిరాజ్,గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆవుల రేణుకను కలిసి అభినందనలు తెలియజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల గ్రామంలో పేద కుటుంబంలో జన్మించి ఎన్ని ఆటంకాలు ఒడిదుడుకులు వచ్చిన తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చదువును కొనసాగిస్తూ..ఒక మహిళ పిహెచ్‌డి డాక్టరేట్ పట్టా పొందడం హర్షనీయమని పేర్కొన్నారు. కొండవీటి సత్యవతి రచనలపై పరిశోధనలు చేసి అంకితభావంతో కష్టపడి ఈ విజయం సాధించడం చాలా గొప్ప విషయమని అన్నారు.రేణుక రాసిన 31 కవితలను"ఆరని కుంపటి" పేరుతో కవితా సంపుటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో రేణుక జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి మంచి రచయితగా చరిత్రలో పేరు తెచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు నిదురం రాజు యాదవ్, కుమ్మరి యాదయ్య, సీనియర్ నాయకులు కుమ్మరి శేఖర్, బోదాసు శంకర్,రవి,శెట్టి శివకుమార్, ఉపాధ్యాయులు మంగలి విజయ్,నవీన్ కుమార్,ఆవుల వెంకటేష్,శివశంకర్,ఆవుల వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

# ఆహ్లాదం పంచేలా... కైదమ్మ కుంట చెరువును రమణీయంగా తీర్చిదిద్దుతా



అరికెపూడి గాంధీ

**శేరిలింగంపల్లి, మే 10 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం హఫీజ్పేట్ డివిజన్ పరిధి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా... పచ్చని పచ్చిక బయళ్ళు, పూదోటలతో ఎంతో సుందర రమణీయంగా కైదమ్మకుంట చెరువును తీర్చిదిద్దడమే తన ముందున్న లక్ష్యం అని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ అన్నారు. ఈ మేరకు నెక్సస్ సెలెక్ట్ మాల్స్ పరిశ్రమ తన కార్పోరేట్ సోషల్ రెస్పాన్స్ విభాగం కింద ముందుకు వచ్చి స్వచ్చందంగా చేపడుతున్న కైదమ్మకుంట చెరువు పునర్జీవ పనులను రాష్ట్ర పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ అరికపూడి మాట్లాడుతూ నెక్సస్ సెలెక్ట్ మాల్స్ కంపెనీ ప్రతినిధులు సామాజిక సేవా కోణంలో ముందుకు వచ్చి నిధులను వెచ్చించి కైదమ్మకుంట చెరువు అభివృద్ధి మరియు పునర్జీవ పనులను చేపట్టడానికి పూనుకోవడం అభినందనీయమన్నారు. కైదమ్మకుంట చెరువు సుందరీకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయనున్నట్లు ఆయన వివరించారు. చెరువు సుందరీకరణ క్రమంలో చెరువు కట్టలు మరింత దృఢంగా నిర్మించడానికి నేటిపారుదలశాఖ అధికారులు పకడ్బందీ వ్యూహంతో వ్యవహరించాలని, కైదమ్మకుంట చెరువులోకి మురుగు నీటిని రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. చెరువుచుట్టూ భూగర్భ డ్రైనేజీ మురుగునీటి కాలువను నిర్మించాల్సిన అవసరం ఉందని, చెరువు అలుగు మరమ్మత్తులు, ఇతర పునరుద్ధరణ పనులు వీలైనంత త్వరలో అభివృద్ధిపరిస్తే ఓవైపు మురుగునీరు, అనారోగ్య సమస్య సమసిపోయి ఆహ్లాదకరమైన చెరువుతోపాటు మార్నింగ్ వాక్ ట్రాక్, ఇతర ఆరోగ్య ప్రదాత కార్యక్రమాలు అందుబాటులోకి వస్తాయని అరికెపూడి భరోసాను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ ఐటి సంస్థ ప్రతినిధులు చైతన్య మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## సైనికుల క్షేమం కోరుతూ దేవాలయంలో అర్చన



**కుత్బుల్లాపూర్ మే 10(జనంసాక్షి):** యుద్ధంలో పోరాడుతున్న సైనికులు సురక్షితంగా, చిరంజీవులుగా ఉండాలని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం జగద్గిరిగుట్టలో ఎన్ఎస్‌యుఐ విద్యార్థి నాయకుడు సాయికుమార్ పంతుల వారి క్షేమం కోసం అర్చన చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన 26 మంది భారత పౌరుల కుటుంబాలకు దేశం మొత్తం అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఆపరేషన్ సింధూర్ తో పాకిస్తాన్ దేశానికి భారత ఆర్మీ గట్టు బుద్ధి చెబుతుందని ఆయన పేర్కొన్నారు. భారత సైనికులకు మద్దతుగా 140 కోట్ల మంది ప్రజలు అండగా ఉన్నారని, ప్రజల మద్దతు ఎల్లప్పుడూ దేశసరిహద్దుల్లో సహారా కాస్తున్న సైనికులకుంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కృష్ణమాచార్యులు, నెంబర్ చెప్పు ఆలయ కమిటీ సభ్యులు చైర్మన్ నరేందర్ రెడ్డి, వేణు గౌడ్, బుచ్చిరెడ్డి, కుత్బుల్లాపూర్ యూత్ కాంగ్రెస్ సర్కిల్ ప్రెసిడెంట్ శ్రావణ్, మల్లికార్జున్ రెడ్డి, చెన్నప్ప, ఆలయ పూజారి శేషు పాల్గొన్నారు.

## విజయవంతంగా సాగిన గ్రామ స్థాయి భగవద్గీత పోటీలు



**దోమ మే 10(జనంసాక్షి):** దోమ మండల పరిధిలోని మోత్కూర్ గరమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ ఆధ్వర్యంలో గ్రామ స్థాయి భగవద్గీత పోటీలు నిర్వహించడం జరిగింది. గ్రామంలోని బాల బాలికలకు మొత్తంగా 15 మంది బాల బాలికలు పోటీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా తిరుపతయ్య ఆచారి పాల్గొన్నారు. భగవద్గీత పారాయణంలో గ్రామంలోని ప్రతి ఒక్క బాల బాలబాలికలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ శ్రీకాంత్ పంతులు గ్రామ మాజీ ఎంపీటీసీ మల్లేశం RSS సంగకర్త గోపాల్‌జి గ్రామ నాయకులు లింగయ్య గ్రామపెద్దలు బాలబాలికలు యువకులు మహిళలు పాల్గొన్నారు. భగవద్గీత పోటీలలో గెలుపొందిన బాల బాలికలకు బహుమతి ప్రధానం చేశారు. ఇంత చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించిన ఆర్ఎస్ఎస్ కార్యకర్త శివని అభినందించారు.

# హయత్‌నగర్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సూపర్ డెంట్, సిబ్బంది కుమ్మక్కై

- సమయపాలన పాటించని సిబ్బంది
- తాళం వేసి ఉన్న సూపర్ డెంట్ గది
- పడకేసిన శానిటేషన్
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి









**హయత్‌నగర్, మే 10 (జనంసాక్షి):** మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ప్రాంతంలోని మండల ఆఫీస్ ఆవరణంలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్లో డాక్టర్లు ప్రజలకు సరైన సేవలు అందించడం లేదని అకస్మాత్తుగా జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి మధ్యాహ్నం 12:00 గంటలకు హాస్పిటల్‌కి వెళ్లడంతో సూపర్‌డెంట్ రూమ్‌కి తాళంవేసి ఉండడం గమనియంగా భావిస్తూ హాస్పిటల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎన్నో రోజుల నుండి చుట్టుపక్కల స్థానిక ప్రజలు, వివిధ గ్రామాల నుండి వచ్చే ప్రజలు, వివిధ పత్రిక మాధ్యమాలలో వారం రోజుల క్రితం నుండి డాక్టర్ల నిర్లక్ష్యమని హాస్పిటల్ లో పనిచేసే ఔట్సోర్సింగ్, శానిటేషన్ సిబ్బంది తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ విధులు సరిగా నిర్వహించకుండా, ప్రజలకు సరైన వైద్యం అందించడం లేదని తెలియడంతో హాస్పిటల్ లో సరైన సౌకర్యాలు అందిస్తున్నారా? అనే విషయంపై అకస్మాత్తుగా హాస్పిటల్‌లో పర్యటించారు. హాస్పిటల్ సూపర్ డెంట్ రూమ్‌కి మధ్యాహ్నం 12:00 గంటలలోపే తాళం వేసి ఉండడం విడ్డూరంగా ఉందని విస్తుపోయారు. హాస్పిటల్‌లో రోగులకు అన్ని సౌకర్యాలు సరిగ్గా అందుతున్నాయా? అని రోగుల వద్దకు వెళ్లి అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్‌కు సూపర్‌డెంట్ ఉదయం వచ్చి తన వేలిముద్రను (అటెండెన్స్) వేసుకొని వెళ్లిపోవడమే తనపనిగా నిర్వర్తిస్తున్నారని, అటెండెన్స్ రిజిస్టర్‌ను చూపించకపోగా తన సమయపాలన పాటించకుండా విధులు నిర్వహిస్తున్నారని వారు సిబ్బందిని హెచ్చరించారు. ప్రజలకు సరైన వైద్యం అందించకుండా లక్షల రూపాయల జీతాలు తీసుకుంటూ సరైన వైద్యం అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆస్పత్రులకు సహాయం అందిస్తున్న కానీ ఇక్కడ మాత్రం రోగులకు సరైన వైద్యం అందించకపోవడం సరైన చర్య కాదని, సూపర్‌డెంట్‌పై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. ఈ ఆస్పత్రిలో 30 పడకల బెడ్లసౌకర్యం ఉండడం ఎంతో అద్భుతంగా భావిస్తూ రోగులు కూడా 28 మంది పైగా ఉన్నారు. కానీ ఉండాల్సిన 20 మంది డాక్టర్లు లేకపోగా ప్రస్తుతం 5 మంది డాక్టర్లు ఉండడం, హాస్పిటల్ ఉన్నతాధికారి సూపర్ డెంట్, డాక్టర్లు, నర్సింగ్, శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది కుమ్మక్కైనట్టుగా కళ్లకు కట్టినట్టుగా కనబడుతుందని వారు అన్నారు. రాత్రి సమయంలో ఉండవలసిన డ్యూటీ డాక్టర్లు లేకపోవడం, హౌస్ సర్జన్లతోని వైద్యం చేపిస్తున్నారని వారు అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించకుండా వీరు వ్యవహరిస్తున్న తీరు కనబడుతుందని, వెంటనే సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని హెచ్చరిస్తూ ఇలాంటి చర్య మళ్ళీ కొనసాగిస్తే సహించబోమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దుర్గ ఫిజిషియన్, డాక్టర్ పురుషోత్తం పీడియాట్రిక్స్, డాక్టర్ ఉమాదేవి గైనకాలజిస్ట్, నర్సింగ్ సూపర్డెంట్ రిచల్, శానిటేషన్ సూపర్వైజర్ సందీప్, డాక్టర్లు, ఫార్మసిస్టులు, సిబ్బంది, బీజేపీ నాయకులు ప్రమోద్ రెడ్డి, మోహన్ రెడ్డి, కడారి యాదగిరి యాదవ్, శ్యాంసుందర్ రెడ్డి, ఎలా రెడ్డి, వెంకటరమణా గౌడ్, జయతేజ, పాల్గొన్నారు.

# కుల, మత సామరస్యం పౌరుల బాధ్యత

- కులం సామాజికం మతం వ్యక్తిగతం మతసామరస్యం పౌరుల బాధ్యత
- బికెఎంయు రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య
- సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య





**చేవెళ్ల,మే 10 (జనంసాక్షి):** కులం సామాజికం మతం వ్యక్తిగతం మతసామరస్యం పౌరుల బాధ్యత అనే అంశంపై భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా బికేఎంయు జిల్లా అధ్యక్షులు జే అంజయ్య ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సెమినార్ చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో బికేఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య అధ్యక్షతనలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...భారత దేశంలో అధికారిక లెక్కల ప్రకారం 3000 కులాలు ఉన్నాయి, 25000 ఉప కులాలు ఉన్నాయని 8 మతాలు ఉన్నాయని, అందులో నూటికి ఎనభై శాతం మంది హిందూ మతం విశ్వసిస్తున్నారని తెలిపారు. కులాలు మతాలు రాజకీయ ప్రయోజనాల కోసం అధికార దాహం కోసం పుట్టినవి అని అన్నారు. ఈ సెమినార్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి బికేఎంయు రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్యలు మాట్లాడుతూ...రాజకీయ ప్రయోజనాల కోసం కులమతాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకుంటున్నారని వారు మండిపడ్డారు. ఇలాంటి రాజకీయాలు చెయ్యడం అనేది సరైనది కాదు అని దుయ్యబట్టారు. భారతదేశ సమాజంలో పుట్టిన ప్రజలకు వృత్తులను బట్టి మనుధర్మ శాస్త్రం ప్రకారం నాలుగు వర్ణాలుగా విభజించి బ్రాహ్మణులు తలలో నుంచి పుట్టారని, వైశ్యులు భుజాల నుంచి పుట్టారని క్షత్రియులు తొడల నుంచి పుట్టారని శూద్రులు పాదాల నుంచి పుట్టారని తలా తోక లేని రాతలు రాసి భారత ప్రజలపై రుద్దారని, ఎవరైనా తల్లి కడుపులోనుంచి పుడతారు కానీ ఇలా మనిషి అవయవాలనుంచి పుట్టారని గుర్తుతెచ్చుకోవాలని వారు తెలియజేశారు. వర్ణాల నుంచి వృత్తులను బట్టి కులాలను అంటగట్టారని వృత్తులన్నీ పొయ్యాయి అన్నికులాలవారు అన్యవృత్తులను చేస్తున్నారన్నారు. అయిన కులాలు పోలేదు ఈ కుల పీడన ప్రజలను పట్టిపీడిస్తున్న పరిస్థితి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కులం మతం సమస్యలతో ప్రజలు అభివృద్ధికి నోచుకోలేకపోతున్నారని, చదువు కావచ్చు, ఆర్థిక అభివృద్ధి కావచ్చు దేనిలో కూడా పేద ప్రజలను అభివృద్ధి వైపు పాలక ప్రభుత్వాలు నడిపిస్తలేవని వారు ఆరోపించారు. నేటికీ గ్రామాలలో గుల్లోకి రానియని పరిస్థితులు కూడా ఉన్నాయన్నారు. దేశానికి స్వతంత్రం వచ్చి 78 సంవత్సరాల అవుతుంటే, మనకు రాజ్యాంగమలై 75 సంవత్సరాలు అవుతుంటే నేటికీ కులవివక్ష అంటరానితనం గ్రామాలలో రాజమేలుతున్న పరిస్థితులున్నా దీనికి కారణం పాలక ప్రభుత్వాలు అనిఅన్నారు. మతం మత విశ్వాసం వ్యక్తిగతమని ఎవరి మతాలు వారి సాంప్రదాయాల ప్రకారం పాటించుకోవచ్చని భారత రాజ్యాంగమే చెబుతుందని కానీ మతాల మధ్యలో చిచ్చులు పెట్టి మతపరమైన దాడులు జరుగుతున్నాయన్నారు. దానికి కారణం మతవిద్వేషాలని రెచ్చగొట్టే రాజకీయ నాయకులు అని ఇలాంటి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కానీ చట్టంలో ఉన్న లొసుగులను అడ్డం పెట్టుకొని బయట దర్జాగా తిరుగుతున్నారని మండిపడ్డారు. ఇకనైనా యావత్ ప్రజానికం మత సామరస్యాన్ని పాటించి అందరూ కలిసిమెలిసి ఉండాల్సిందిగా వారు ప్రజానీకానికి పిలుపునిచ్చారు. కులపరమైన మతపరమైన ఎలాంటి సంఘటనైన ప్రతిఘటించి ఎదుర్కొని ప్రజలకు అండగా ఉండి పోరాడుతున్న పార్టీ ఏదైనా ఉందంటే అది సిపిఐ ప్రజాసంఘాలేనని వారు అన్నారు. ఇకనైనా పాలక ప్రభుత్వాలు పేద ప్రజల సమస్యలపై దృష్టిపెట్టి ఆర్థిక అసమానతల పోగొట్టే విధంగా పథకాలను పేదలకు అందే విధంగా కూడు గూడు విద్య వైద్యంతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని వారు పాలక ప్రభుత్వాల డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కే రామస్వామి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం ప్రభు లింగం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, మహిళా సమైక్య జిల్లా కార్యనిర్వాక అధ్యక్షురాలు వడ్ల మంజుల, వ్యవసాయ కార్మిక సంఘం నాయ కులు స్వరూప, యశోద, పాల్గొన్నారు.

## సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో భారత త్రివిధ దళాలకు మద్దతుగా సంఘీభావ ర్యాలీ



**రాజేంద్రనగర్,మే10(జనంసాక్షి):** పాకిస్తాన్ సైనికులతో పోరాడు తున్న త్రివిధ దళాలకు మద్దతుగా సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో భారత త్రివిధ దళాల సైనికులకు మద్దతుగా సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. మణికొండ బీఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాం దూళిపాల ఆధ్వర్యంలో మణికొండ మర్రిచెట్టు నుంచి అల్కాపూర్ యోగ సెంటర్ వరకు జాతీయ జెండాలు చేత్తో పట్టుకొని సైనికులకు మద్దతుగా నినాదాలు చేశారు. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడి పొట్టన పెట్టుకున్న 26 మంది అమాయకుల ప్రాణాలకు ప్రతికారంగా ఉగ్రవాదులను, ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసి చావుదెబ్బ కొట్టిందని, హిందుస్థాన్ జిందాబాద్, పాకిస్తాన్ ముర్దాబాద్ అంటూ నినాదాలతో భారత సైనికులకు సంఘీ భావంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిటిజన్ కౌన్సిల్ కార్యదర్శి బొమ్మ ఉపేంద్ర నాథ్‌రెడ్డి, అండే లక్ష్మణ్, షేక్ అరీఫ్, ఏర్పుల శ్రీకాంత్, అరీఫ్, సుమనళిని, బొడ్డు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి చెరువులను సుందర శోభిత వనంగా తీర్చిదిద్దుతాం



అరికెపూడి గాంధీ

**శేరిలింగంపల్లి, మే 10 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని చెరువులన్నింటినీ సుందర శోభిత వనంగా తీర్చిదిద్దడం ద్వారా వాటికి అద్భుత మహార్దశను కల్పించనున్నామని రాష్ట్ర ప్రజా పద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ అన్నారు. ఈ మేరకు మియాపూర్ డివిజన్ పరిధి పటేల్ చెరువు, మక్తా మహబూబ్పేట్ పరిధి పెద్దకుడి చెరువు తదితర చెరువుల సుందరీకరణలో భాగంగా నెక్సస్ సెలెక్ట్ మాల్స్ కంపెనీ వారి కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ విభాగం కింద అందజేసిన నిధుల ద్వారా చేపడుతున్న పునరుద్ధరణ పనులను మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి శనివారం అయినా పరిశీలించారు. గురునాథం చెరువు సుందరికరణ, సంరక్షణ,అభివృద్ధి పనులను నెక్సస్ సెలెక్ట్ మాల్స్ కంపెనీ ప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చేపట్టడం జరుగుతుందని, ఇదేక్రమంలో ఐజియుఎస్, హెచ్డిఎఫ్సి, మల్లిగా వాడ్ తదితర ఐటి కంపెనీలు, సంస్థలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ విభాగం కింద శేరిలింగంపల్లి పరిధి చెరువుల అభివృద్ధి కోసం కోట్ల రూపాయలను వెచ్చించి స్వచ్ఛందంగా చెరువుల పరిరక్షణకు పూనుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామం అన్నారు. చెరువు సుందరికరణలో భాగంగా చెరువుకట్టను పటిష్ట పరిచేలా పునరుద్ధరణ, మురుగునీరు చెరువులో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే మురుగు నీటికాల్వ (యుజిడి) నిర్మాణం మరియు అలుగు మరమ్మత్తులు, చెరువు కట్ట బలోపేతం పనులు, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడుతామని పిఎసి చైర్మన్, కార్పొరేటర్ వివరించారు. చెరువు సంరక్షణలో భాగంగా చెరువు చుట్టూ ఫెన్సిగ్ (కంచె) నిర్మాణం మరియు చెరువు యొక్క అలుగు నిర్మాణపు పనులు చేపడుతున్నామని, త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ఐటి సంస్థ ప్రతినిధి చైతన్య, అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మే 12 నుంచి ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్

**ఉప్పల్ మే 10 (జనంసాక్షి) :** మే 12 నుంచి స్లాట్ బుకింగ్ ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ నెల 12 నుంచి ఆన్లైన్ స్లాట్ బుకింగ్ విధానం అమలులోకి రానుందని సబ్ రిజిస్ట్రార్ విజయ జ్యోతి తెలిపారు. ఇందుకోసం మరో రిజిస్ట్రార్ని కేటాయించనున్నారు. మొత్తం 96 స్లాట్లు అందుబాటులో ఉంటాయని, స్లాట్ ప్రకారంగా కార్యాలయానికి రావాలని సూచించారు. మొదటిరోజు కాస్త ఇబ్బందులు ఎదురైనప్పటికీ అన్నింటిని అధిగమిస్తామని శనివారం పేర్కొన్నారు.